క్లుప్తంగా

బాధితుడికి ఎమ్మెల్యే ఆర్థికసాయం


రాజేష్ కుటుంబసభ్యులకు నగదును అందిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు: బ్రెయిన్ ఫీవర్‌తో బాధపడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్‌కు వైద్యఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి రూ.50 వేలు ఆర్థికసాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. నాలుగు రోజుల కిత్రం రాజేష్ తీవ్రమైన జర్వంతో పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. తర్వాత వైద్యుల సూచనల మేరకు కర్నూలు తరలించారు. అక్కడి వైద్యులు రాజేష్‌కు బ్రెయిన్ ఫీవర్ సోకినట్లు నిర్ధారించి హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే హైదరాబాద్‌లోని డాక్టర్లతో మాట్లాడి రాజేషను అక్కడికి తరలించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాజేష్ కుటుంబ సభ్యులకు రూ.50 వేలు అందజేయడంతోపాటు ధైర్యం చెప్పారు.

అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు


అంగన్వాడీ కార్యకర్త ఇంటికి షోకాజ్ నోటీసు అతికిస్తున్న సూపర్‌వైజర్

యాడికి: అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించినప్పటికీ విధుల్లో చేరకపోవడంతో అంగన్‌వాడీలకు ఐసీడీఎస్ సిబ్బంది షోకాజ్ నోటీసులను అందజేశారు. మండల వ్యాప్తంగా 48 అంగన్‌వాడీ కేంద్రాలు, 20 మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 68 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 48 మంది ఆయాలు విధులు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల క్రితం యాడికి నం:4లో అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా, నిట్టూరు అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు విధుల్లో చేరారు. దీంతో మిగిలిన 65 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 47 మంది ఆయాలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి నోటీసులు శుక్రవారం అందజేశారు. అంగన్‌వాడీ సిబ్బందికి స్వయంగా అందజేస్తే వారు తీసుకునేందుకు నిరాకరించారని, దీంతో వారి ఇళ్లకు నోటీసులు అతికించినట్లు సూపర్‌వైజర్ తెలిపారు.

ప్రభుత్వ భవనాల పరిశీలన


ఎంఆర్‌సీ భవనాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటశివారెడ్డి


శింగనమల: సార్వత్రిక ఎన్నికల బందోబస్తుకు వచ్చే కేంద్ర బలగాల వసతి కోసం మండల కేంద్రంలోని పలు భవనాలను అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఎమ్మార్సీతో పాటు పలు భవనాలను పరిశీలించిన ఆయన అందులో వసతుల ఏర్పాట్లపై సిబ్బందితో చర్చించారు. బుక్కరాయసముద్రం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

తాడిపత్రిటౌన్: సజ్జలదిన్నె సమీపంలో ఉన్న ఏపీఎస్పీ బెటాలియన్ భవనాన్ని డీఎస్పీ గంగయ్య శుక్రవారం పరిశీలించారు. ఎన్నికల సిబ్బంది వసతి కోసం భవనాన్ని పరిశీలించినట్లు డీఎస్పీ తెలిపారు. ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్, సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్ఐ గౌస్ మహ్మమద్ ఉన్నారు.

మదరసాకు విరాళం

తాడిపత్రి అర్బన్: రమేష్‌రెడ్డి కాలనీలో ఉన్న మదరసాకు ఎస్ఎస్ నెంబర్5 బీడి పరిశ్రమ యజమాని హీరాపురం నియాజ్‌బాషా శుక్రవారం రూ.20 వేల విరాళం అందజేశారు. ముతవల్లి షేర్‌ఖాన్‌కు మొత్తాన్ని అందించారు. పేద ముస్లిం విద్యార్థుల చదువు కోసం విరాళమిచ్చినట్లు నియాజ్‌బాషా తెలిపారు. ఖాదర్ బాషా, మాబుసాబ్, షఫీ, దాదా ఖలందర్, మహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఐటీలో వర్క్‌షాప్


మాట్లాడుతున్న టీపీఓ రంజిత్‌రెడ్డి

బుక్కరాయసముద్రం: రోటరీపురంలోని ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ విభాగం సిబ్బందికి శుక్రవారం స్కిల్స్ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాపు నిర్వహించారు. ట్రైనర్ వినోద్ మాట్లాడుతూ అధ్యాపకులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. అనంతరం మైక్రోసాఫ్ట్ బేసిక్స్, మైక్రోసాఫ్ట్ ఎక్సెల్ బేసిక్స్, ఎఫెక్టివ్ ఇంటర్నెట్ సెర్చింగ్ ఈమెయిల్ కమ్యూనికేషన్, బెస్ట్ ప్రాక్టీస్ ఇంటర్నెట్ సెక్యూరిటీపై వివరించారు. అరవింద బాబు, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ రంజిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఐక్యూఏసీ డైరెక్టర్ సాయి చైతన్య కిశోర్, హెచ్ఓడీ మేరీమాత పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఆరోగ్యం పదిలం


పామిడి మండలం పాళ్యతండాలో వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది


పెద్దపప్పూరు మండలం ముచ్చుకోటలో మెడికల్ రిపోర్టును అందిస్తున్న డా.ఉషారాణి

పామిడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్, సర్పంచ్ ఆర్ వెంకటేష్‌నాయక్ అన్నారు. శుక్రవారం పాళ్యతండాలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఎద్దులపల్లి ప్రాథమిక వైద్యాధికారి సుధాకర్, వైద్యులు నితిన్ కుమార్, పరమేశ్వర్, వీ సుధాకర్ 474 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని డీపీఎంఓ డాక్టర్ రవికుమార్ పర్యవేక్షించారు.

పెద్దవడుగూరు : స్థానిక గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరం నిర్వహించారు. పెద్దవడుగూరు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యులు శ్రీనివాసులు, అమర్‌నాథ్, గైనకాలజిస్ట్ సుజాత 476 మంది రోగులకు వైద్యం అందించడంతో పాటు మందులను పంపిణీ చేశారు. ఎంపీడీఓ కుళ్లాయిస్వామి శిబిరాన్ని పర్యవేక్షించారు.

యల్లనూరు: బుక్కాపురం గ్రామంలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 259 మందిని పరీక్షించి మందులు అందజేశారు. ఎంపీపీ గంగాదేవి, ఎంపీడీఓ వీరరాజు, సర్పంచు లక్ష్మీదేవి, వైద్యులు శశికళ, సాయి నాగశ్రీ, ప్రభాకర్‌నాయుడు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: ముచ్చుకోట గ్రామ సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి డా.ఉషారాణి వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమర్‌నాథరెడ్డి, ఎంపీడీఓ రామకృష్ణ,హెల్త్ సూపర్‌వైజర్ శర్మాస్‌వలి పాల్గొన్నారు.

గార్లదిన్నె: బూదేడు గ్రామ సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి ఓబులు శిబిరాన్ని పరిశీలించారు. వైద్యులు 430 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఎంపీడీఓ విజయభాస్కర్, పీహెచ్‌సీ డాక్టర్లు గౌతమి,దిలీప్, స్పెషల్ డాక్టర్లు హరికృష్ణ, ప్రసాద్, మహతి, సీహెచ్ఓ లోకనాథ్,ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరరావు, పీహెచ్ఎన్ అరుణ, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: తురకపల్లి గ్రామంలో శుక్రవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, దేవేంద్రనాయక్ రోగులకు పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, ఎంపీడీఓ చిట్రా శ్రీనివాసులు పరిశీలించారు. అనంతరం జగనన్న సురక్ష కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి సుమలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం


భూపత్రాలు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే వైవీఆర్

● ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లు: బడుగుల అభ్యున్నతే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ భూమి పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 185 మందికి డీకేటీ పట్టాలు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మరో 348 మంది రైతులకు భూమిహక్కు మంజూరు పత్రాలను ఎమ్మెల్యే ఆందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగనన్న రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారన్నారు. ఇందులో భాగంగా నిరుపేద రైతులు సాగు చేసుకుంటున్న డీకేటీ భూములపై వారికే సంపూర్ణ హక్కులు కల్పించేలా భూమిహక్కు పత్రాలు అందజేస్తున్నారన్నారు. రైతులు తమ భూములను అమ్మడానికి, కొనడానికి వీలుగా ఉత్తర్వులు జారీ చేశారన్నారు. భూమి పట్టాలను సంక్రాంతి కానుకగా మన ఇంటి ఆడుపడుచులకు అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా రూ.3 వేలు పింఛన్‌ను అందజేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. జగనన్న ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలతో బెంబేలెత్తిన చంద్రబాబు తన కుటిల బుద్ధితో ఆచరణకు సాధ్యం కానీ హామీలను తన మేనిఫెస్టోలో ప్రకటించారన్నారు. అయితే వాటిని ప్రజలు నమ్మరనే ఉద్దేశంతో పావలా కళ్యాణ్, బీజేపీ ఇతరత్ర పార్టీలతో పొత్తుపెట్టుకొని ఎన్నికల్లో పోటీ చేస్తున్నారన్నారు. ఏదీ ఏమైనా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపుకు జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే శ్రీరామరక్షగా నిలిచి భారీ మెజార్టీతో అన్ని స్థానాలు కైవసం చేసుకోవడం ఖాయమని జోస్యం చెప్పారు. అంతక ముందు తహసీల్దార్లు ప్రతాప్‌రెడ్డి (గుంతకల్లు), సునీతబాయి మాట్లాడుతూ ఎమ్మెల్యే చొరవతో సాగు రైతులకు భూమి హక్కు పత్రాలు మంజూరు చేయించారన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య, డిప్యూటీ తహసీల్దార్ రాము, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాయలసీమ జోనల్ ఇంచార్జ్ జింకల రామాంజనేయులు, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి బావన్న, సచివాలయ మండల కన్వీనర్ గోవింద్‌నాయక్, పోలింగ్ బూత్ కన్వీనర్ రాము, మాజీ సర్పంచ్ భాస్కర్‌నాయుడు, మాజీ ఎంపీటీసీ పాటిల్ జయరామిరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు సిపాయి బాషా, సర్పంచులు నక్కా ఓబులేసు, నారాయణ స్వామి, బొజ్జన్న, యోగానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కందుల విక్రయాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి


మాట్లాడుతున్న డీఏఓ ఉమామహేశ్వరి

గార్లదిన్నె: ఖరీఫ్‌లో రైతులు పండించిన కందుల విక్రయానికి రైతు భరోసా కేంద్రాల్లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని డీఏఓ ఉమామహేశ్వరీ పేర్కొన్నారు. శుక్ర వారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. డీఏఓ మాట్లాడుతూ రైతుల నుంచి కందులను మార్కెట్ ధర ప్రకారం కొనుగోలు చేస్తామన్నారు. ఏఓ సోమశేఖర్, పశువైద్యాధికారి రమేష్ పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతోనే కంది, జొన్న, కొర్ర తదితర పంటను కొనుగోలు చేస్తామని గుత్తి ఏడీఏ వెంకట్రాముడు, ఏఓ మల్లీశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్బీకే లో మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ త్వరలోనే పత్తి కొనుగోలు చేస్తామని, రైతులు ఆర్బీకేల్లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఏఈఓ రజిని, సునీత, రైతులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: రైతుల ఆదాయం పెంచేందుకు వ్యవసాయ అధికారులు కృషి చేయాలని జెడ్పీటీసీ భాస్కర్ కోరారు. శుక్రవారం వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కొండన్న అధ్యక్షత సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు రైతులకు చేరవేయాలన్నారు. వెటర్నరీ ఏడీ డాక్టర్ రత్నకుమార్ మాట్లాడుతూ పశువుల షెడ్ల నిర్మాణాల కోసం 128 దరఖాస్తులు వచ్చాయని, అర్హులైన వారికి మంజూరు చేస్తామన్నారు. ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి, సాకే లక్ష్మీనారాయణ, ఏపీఎంఐపీ అధికారి హరిత పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

యల్లనూరు: చింతకాయ మంద క్రాస్ వద్ద అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ ధరణీబాబు తెలిపారు.

పాత నేరస్తులకు కౌన్సెలింగ్


పాత నేరస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న దృశ్యం

యల్లనూరు: స్థానిక పోలీసుస్టేషన్‌లో శుక్రవారం పాత ఎక్సైజ్ కేసుల్లోని నేరస్తులకు ఎస్ఐ ధరణీబాబు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇక నుంచి పద్ధతిగా బతకాలని బుక్కాపురం వాసి వెంకటరామయ్య, తిమ్మంపల్లి రవికుమార్‌రెడ్డి, కుచివారిపల్లి పత్తిపాటి ప్రసాద్, కొండాపురం రమేష్‌నాయుడుకు ఎస్ఐ సూచించారు. అనంతరం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయించారు.

పూరిల్లు దగ్ధం

తాడిపత్రి అర్బన్: పట్టణంలో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఓ పూరిల్లు దగ్ధమైంది. పాత ఈద్గా సమీపంలో బాబా, ఆరిఫా దంపతులు ఓ పూరి గుడిసెలో నివాసముంటున్నారు. రెండు రోజుల క్రితం వీరు వారి సమీప బంధువుల ఊరికెళ్లారు. శుక్రవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఇల్లు దగ్ధమైంది. ఘటనలో రూ.1.9 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు.

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోండి


గుంతకల్లులో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

గుంతకల్లుటౌన్: కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఆర్ఓ నాసిర్‌హుసేన్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని రాయల్ సర్కిల్ వద్ద వికసిత్ భారత్ యాత్ర సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, ప్రభుత్వరంగ బ్యాంకుల అధికారులు తొమ్మిదన్నరేళ్లల్లో మోదీ సర్కారు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. మెప్మా టీపీఆర్ఓ మోహన్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వాతి, బీఓబీ మేనేజర్ సిపి.బాబు, మెప్మా సీఓలు, బీజేపీ నాయకులు హరిహరనాథ్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు: మండలంలోని శనగలగూడూరు, కొండేపల్లి గ్రామాల్లో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రచార వాహనం ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు ఇప్పటికే అందించిన లబ్ధిని ప్రజలకు వివరించామన్నారు. సర్పంచ్ జనార్ధన్‌నాయుడు, వైస్ సర్పంచ్ జయరామిరెడ్డి పాల్గొన్నారు.

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని పాత పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, టీఎంసీ కెరస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 15 సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు.

ముగిసిన మండల స్థాయి క్రీడాపోటీలు


విజేతగా నిలిచిన శింగనమల క్రికెట్ జట్టు

శింగనమల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారమ ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా ముగిసాయి. ఫైనల్ పోటీలో రాచేపల్లి జట్టుపై శింగనమల జట్టు విజయం సాధించి, నియోజకవర్గ స్థాయికి ఎంపికైనట్లు ఎంపీడీఓ నిర్మలాకుమారి తెలిపారు. పీడీలు నందకుమార్, బయపరెడ్డి, నరసింహారెడ్డి, నరేంద్రరెడ్డి, శిరీష, స్వర్ణ, పంచాయతీ కార్యదర్శి రామాంజినేయులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలకేంద్రంలో శుక్రవారం జరిగిన మండలస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీల్లో మేడిమాకుపల్లి జట్టు విజేతగా నిలిచింది. నియోజక వర్గస్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి మండలానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఎంఈఓ రాముడు, ఎస్ఐ శ్రీనివాసులు మేడిమాకుపల్లి జట్టుకు సూచించారు. మేడిమాకులపల్లి సర్పంచ్ రామాంజినేయులు, నాయకులు నాగేశ్వరావు, చింతలచెరువు మాజీ సర్పంచ్ మహేశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండల కేంద్రంలో శుక్రవారం ఆడుదాం అంధ్రా పోటీలు జరిగాయి. కబడ్డీలో మర్తాడు జట్టుపై కల్లూరు-3 జట్టు విజయం సాధించి నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికై నట్లు ఎంపీడీఓ విజయభాస్కర్ తెలిపారు.

యాడికి: మండల కేంద్రంలో ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం జరిగిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో యాడికి జట్టు, వి.కొట్టాలపల్లె జట్టుపై గెలుపొంది నియోజక వర్గ స్థాయికి ఎంపికైనట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ కాశెప్ప, యాడికి పంచాయతీ ఈఓ ఎర్రిస్వామి, పీడీలు పాల్గొన్నారు.

గుంతకల్లు: ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా శుక్రవారం స్థానిక శంకరనంద గిరి స్వామి డిగ్రీ కళాశాలలో జరిగిన క్రికెట్ పోటీల్లో రాజేంద్రనగర్ సచివాలయ జట్టుపై దోనలుడికి గ్రామ సచివాలయ జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన దోసలుడిక గ్రామ సచివాలయ జట్టు 10 ఓవర్లలో 137 పరుగులు చేసింది. అందులో జట్టు కెప్టెన్ శీనసాయక్ 109 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. అనంతరం బ్యాటింగ్ చేసిన రాజేంద్రనగర్ జట్టు 58 పరుగులకే ఆలౌట్ అయింది.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం


విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కృషి చేద్దామని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. కసాపురంలోని బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ దేశానికి దశ దిశను నిర్దేశించి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంస్కరణలు తెచ్చారన్నారు. నేటి యువత ప్రపంచ మేధావి అయిన అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుస్తూ దేశ అభ్యున్నతికి పాటుపడాలని పిలుపునిచ్చారు. రాయలసీమ దళిత సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేఎల్ స్వామిదాసు, నాయకులు డీ.సుంకన్న, పవన్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస వేడుకలు

తాడిపత్రి అర్బన్: స్థానిక రెడ్డివారిపాలెంలోని శ్రీకోదండ రంగనాథస్వామి ఆలయంలో ధనుర్మాస వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు శేషాద్రి ఆధ్వర్యంలో గోదా దేవి, కోదండ రంగనాథస్వామికి అభిషేకాలు అర్చనలు జరిపారు. పట్టు వస్త్రాలు, ఎన్నో రకాల సుగంధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

డైరీ ఆవిష్కరణ


డైరీ ఆవిష్కరిస్తున్న డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి

బుక్కరాయసముద్రం: ఏపీఎస్పీ 14 బెటాలియన్ పోలీస్ యూనియన్ డైరీని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించినట్లు యూనియన్ అధ్యక్షుడు పెద్దయ్య తెలిపారు. డీజీపీ కార్యాలయంలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి సిబ్బంది సమస్యలు వివరించామన్నారు. త్వరలో పోలీస్ వెల్ఫేర్ జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తామని, సమస్యలను చర్చించుకుని పరిష్కాస్తామని డీజీపీ హామీ ఇచ్చారని తెలిపారు.

మద్యం విక్రేతల అరెస్ట్

పుట్లూరు: మండలంలోని చాలవేముల గ్రామలో శుక్రవారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న శివ శంకర్‌రెడ్డి అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ దిలీప్ కుమార్ తెలిపారు. అతని వద్ద నుంచి 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే తమకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

యల్లనూరు: బుక్కాపురం గ్రామంలో శుక్రవారం మద్యం విక్రయిస్తున్న వెంకటరామయ్య అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈసందర్భంగా నిందితుడి నుంచి 23 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ధరణీబాబు తెలిపారు.

పెద్దవడుగూరు : చిట్టూరు గ్రామంలో మద్యం విక్రయిస్తున్న కుందనం చిన్న గంపయ్య అనే వ్యక్తి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 17 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

'అభివృద్ధి పనులు కనపడలేదా'

పెద్దవడుగూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, జేసీ అస్మిత్‌రెడ్డి కనపడలేదా అని వైఎస్సార్‌సీపీ అనంతపురం పార్లమెంట్ యువజన విభాగం కార్యదర్శి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో జరిగిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో వారు మండలంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని వారు వ్యాఖ్యానించడంపై రామచంద్రారెడ్డి మండిపడ్డారు. తమ ప్రభుత్వంలో గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్‌క్లినిక్‌లు, సీసీరోడ్లు, డ్రైనేజీలు, ప్రభుత్వాస్పత్రి భవనాలు నిర్మించామన్నారు. మండలంలోని రైతులకు రూ.73 కోట్లు పంట నష్ట పరిహారం అందించిన ఘనత తమ ప్రభుత్వానిదన్నారు.

అనాథలకు అల్పాహారం

గుత్తి: సినీ హీరో మహేష్ బాబు నటించిన గుంటూరు కారం విడుదల సందర్భంగా ఆయన ఫ్యాన్స్ కొత్తూరు అనాథాశ్రమంలోని అనాథ పిల్లలు, వృద్ధులకు శుక్రవారం అల్పాహారం ఏర్పాటు చేశారు. మహేష్ బాబు అభిమాన సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, మర్తాడు దాదా ఖలందర్, జీపు బాషా, కందుల చంద్ర, మర్తాడు అన్సార్ , నరేష్, హరి, ఆనంద్, ఆర్‌బీ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

గొర్రెల దొంగల ఆచూకీ లభ్యం

గార్లదిన్నె: కల్లూరులో ఆంజనేయులు అనే వ్యక్తికి చెందిన గొర్రెలను దొంగలించిన వ్యక్తుల ఆచూకీ లభించింది. పోలీసులు తెలిపిన వివరాలు..గురువారం తెల్లవారుజామున విడపనకల్లు మండలం వద్ద గొర్రెలు వ్యాన్ ఎద్దుల బండిని ఢీ కొట్టి బోల్తాపడింది. గార్లదిన్నె పోలీసులు సంఘటన స్థలం వద్దకు వెళ్లి విచారణ చేయగా గొర్రెలు దొంగలు కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన సంతోష్, విజయ్, అమ్‌రీష్‌గా గుర్తించారు. వారి నుంచి 8 గొర్రెలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం


నాగయ్య(ఫైల్)

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని సంజీవనగర్‌కు చెందిన నాగయ్య అదృశ్యమయ్యాడు. వివరాలు.. పట్టణంలోని జూనియర్ కళాశాల వాచ్‌మెన్‌గా పనిచేస్తుండేవాడు. డిసెంబర్ 28న నాగయ్య ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆయన కుమార్తె సుమలత తెలిసిన చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

వైద్యరంగానికి పెద్దపీట

పెద్దవడుగూరు : వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్దవడుగూరులో రూ.కోటి దాకా నిధులు వెచ్చించి నూతన ఆసుపత్రి భవనాన్ని నిర్మించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 11 వేల విలేజ్ హెల్త్ క్లినిక్ లను ఏర్పాటు చేసి ప్రజల చెంతకే నాణ్యమైన వైద్యం అందిస్తున్నారన్నారు. ఐటీ విభాగం సభ్యులు జ్ఞానేశ్వర్‌రెడ్డి, నారాయణ, మస్తాన్, రంగస్వామి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

భారత్‌వికాస్ పరిషత్ సేవలు అభినందనీయం

గుంతకల్లు టౌన్: ఏటా స్వామి వివేకానంద జయంతి నాడు దివ్యాంగులకు కృత్రిమ పరికరాలు ఉచితంగా అందిస్తున్న భారత్ వికాస్ పరిషత్ సేవలు అభినందనీయమని నగర ఉత్సవ సమితి కోశాధికారి ఇల్లూరు లక్ష్మీనారాయణ, వ్యాపారవేత్త రామ్మోహన్ గుప్త కొనియాడారు. శుక్రవారం పట్టణంలో దాత ఎం.భాస్కర్ రంగయ్య,విజయలక్ష్మి దంపతుల సౌజన్యంతో తయారు చేయించిన కృత్రిమ కాళ్లు, చేతులను 40 మంది దివ్యాంగులకు అందజేశారు. భారత్ వికాస్ పరిషత్ జిల్లా ప్రతినిధి పరుచూరు రమేష్, గుంతకల్లు ఇన్‌చార్జ్ ఇల్లూరు లక్ష్మీనారాయణ, డాక్టర్ ప్రభాకర్, వీహెచ్‌పీ కార్యదర్శి మురళీ, దేవస్థాన కమిటీ ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, కార్యదర్శి నారాయణస్వామి పాల్గొన్నారు.

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి

బుక్కరాయసముద్రం: యువత వివేకానందుని జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఎస్కేయూ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ కన్సల్టెంట్ డాక్టర్ సుబ్బారావు పేర్కొన్నారు. శుక్రవారం రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ ఎన్ఎస్ఎస్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కళాశాలలో స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, టీపీఓ రంజిత్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చిన్న పుల్లయ్య, ఐక్యూఏసీ సెంటర్ అధికారి డాక్టర్ సాయి చైతన్య కిషోర్, కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ వీర ప్రకాష్, డాక్టర్ హేమంత్ కుమార్, స్టూడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ సునీత పాల్గొన్నారు.